## ౯ భయం

భయమనేది వొకటి చిన్నప్పట్నుంచీ మన కలవడ్డ ఎరువుగుణం దాన్నిమానవుని యొక్క సహజమైన సరుకుల్లో వానినిగా ఎంచడాని కెంతమాత్రమున్నూ వీల్లేదు. పోంగొట్టుకునే వాళ్ళకది పోతూనేవుంది. కాని తెచ్చిపెట్టుకునేవాళ్ళకు కుదిరి నెత్తిమీది దేవతలా కూర్చుంటూనేవుంది. ఆహారనిద్రల్తోపాటుజతగూర్చి భయమనేది సర్వసామాన్య నిసర్గప్రవృత్తిగా పంచతంత్రకారుడు వ్రాసేడుగాని అది వాని తంత్రమంత్రమే ! మనలోని ముడిపదార్థం ఎంతమాత్రమున్నూ కాదు.

మొట్టమొదటి భయదరూపం "బూచి" ప్రతిచంటి పిల్లను "బూచేవు, బూచొస్తోంది. బూచేవు !" అని జడిపిస్తారు తల్లితండ్రులూ అన్నలూ అప్పలూ. ఆకారంకూడా ఆచిట్టి యొక్క కట్టెదుట నిలబెట్టి నట్టు అక్షరాలా వర్ణించి అభినయించి చూపెడతారు. "అదిగోనేవ్ ! ఎంతెంతగుడ్లో దానివి ! ఎంతగడ్డముందో దానికి ! జడలెల్లా విరబోసుకుని చీకట్లోంచి తోవ చేసుకుంటూ బావురు బావురుమంటూ వస్తూవుందో !" అని ఆ చిట్టికళ్ళు మూసుకొని గుర్రిక్కుమిక్కు మనకుండా నక్కి చిక్కి పోయేదాకా గాని విడిచిపెట్టరు.

ఇలాగ్గానే నన్ను అంతా ఝుడిపించారు ఐదుఏళ్లు వచ్చేదాకా: అయిదోయేట ఏంజరిగిందీ ! నా నెత్తిమీద క్రమక్రమంగా బలిసి అది

విలా అల్లుకుపోయిన పుట్టువెండ్రుకల్ని అన్నింటినీ కేశఖండన మహో త్సవమప్పుడు తీసివేయడం సంభవించింది. దాంతో ఆ బోడిబుర్ర అద్దంలో చూచుకొని "బూచాడి పనికూడా ఇలా పట్టేస్తే వానికి గడ్డం జడలూ అన్నీ వమ్మయిపోతాయిగదా" అని అనుకొన్నాను. అనుకోని వోమాటు మాయింట్లో అలమారులోవుండే పోటకత్తిపుచ్చుకొనీ కాళాంధకా రంలో అమవసనిసిని బయల్దేరాను. "బూచాడి గడ్డం బూచాడి జడలు తెగ్గోసిపారేశాదా"మని బయల్దేరాను. కత్తి ఎప్పుడైతే చేత్తో పట్ట గలిగానో అప్పుడే బూచాడు మాయమై పోయినాడు.

రెండో భయదరూపం ఉపాధ్యాయుడు. అమ్మ వీడిల్లు బంగారం గాను; ఉపాధ్యాయుడు అనే మనిషి ఉన్నాడే అతడు బూచాడుకంటే పొడుగ్గాకూడా వుండి పిల్లల్ని వేదించుకుతింటూ వుంటాడు. మాట్లాడితే 'అయ్యవారొస్తారోయ్' అని హడలగొట్టేశేవారు, ఇంటిల్లిపాదీని; తిన్నగా నన్ను మెతుకులు కూడా తిననిచ్చేవారు కారు. బూచాడు చీకట్లో ఉండే నన్ను భయపెట్టేవాడు గాని, ఈ అయ్యవారయినట్టయినా పట్టపగలే దోపిడీఅన్నట్టు, నా ఆటల్ని దోచుకుపోయేవాడు. ఎక్కడ కనబడితే అక్కడే "ఏంచేస్తూవున్నావు అబ్బాయీ ?" అనేవాడు. ఆ అనడం వినీ వినడంతోనే నా ప్రాణాలు కడట్టిపోయేవి. ఈ భయం ఎలా వదిలించు కోవడమా అని చాలాకాలం యోచిస్తూ రాగా. ఎప్పటికయినా ఫలి స్తుంది తపస్సు ! నాకు వడుగు చేశారు. ఆ తరువాత అయ్యవారు వచ్చి చెవులెక్కతియ్యబోతే "ఏమండో! నేను మడిగట్టుకొన్నాను. నాకు వడు గైంది. నన్ను ముట్టుకోబోకండి నన్ను ముట్టుకున్నారా అంటే మా అమ్మతోనూ మా నాన్నతోనూ చెప్పి మిమ్మల్ని చితక తన్నించేస్తాను" అనేవాణ్ని. వడుగు అనేది మగవాణ్ని పిడుగ్గా చేస్తుంది అనుకోండి. ఉపాధ్యాయులవారు "నీకు అవితే, బ్రహ్మోపదేశం బాగానే అయింది!"

అని వెనక్కు వెళ్ళిపోయేవారు. అది పనిగా బరెగేసి, బ్రహ్మవిద్యాపరుణ్ణి అయినకొద్దీ ఎటువంటి గురువొచ్చినా "నీవెంత? నీ పేజ్బె త్తమెంత ?" అని ముదలకించేవాణ్ణి. ఏమనుకున్నారో !

మఱి మూడో భయదరూపం పాపభయం. ఈ భయానికి రూప నిష్పత్తి చేయడమే బహూప్రయాస. నల్లని కాల్తో రాయడం దోమను చేత్తో మోదడం ఇదే పాపం అని కొందఱు నిర్వచిస్తూ వుంటే, అలగోల బాలగోల అయిపోతుందనే వెఱపూ వెంచాటూ లేకుండా ఏరోప్లేనులనుండి కొందఱు ఘోరంగా బాంబులు నేలకు విసిరేస్తూ వున్నారు ! పాపరూప ప్రమాణం కామరూప ప్రమాణం ఒకటే — చింతాకంత పాపం తామ రాకంతవుతుంది. చీపురుపుల్లంత పాపం తాళవృక్ష మంతవుతుంది. అంచేత ఈ పాపమనే భయం ఏ పనిచేదామన్నా మనిషిని సంకుచిత స్వభావునిగా చేసిపారేస్తుంది.

దీనికో చిన్న ఇతిహాసం ఉంది — బలే నవ్వొస్తుంది చదివితే. చదవకుండానే నవ్వొస్తుందా మఱీమంచిది—

చంద్రవంక అనే వొంకపు టొయారి వొక్కత్తె ఉంది. ఈ జగత్తులో తప్పపుట్టింది అది. చిత్రకారుడు చిత్రిస్తే రెండు గీతలు గీసి ఒక చుక్కెట్టి ఆ స్త్రీ యొక్క వక్షోజాన్ని చూపించ గలడేమోగాని, ఆ వక్షోజాన్ని ఆవరించి వుండే చీరపయట సౌందర్య పరివేషం మన మూహించుకోవలసిందే. కవి విలిఖిస్తే నాలుగుపంక్తుల్లో ఆస్త్రీయొక్క అధరోష్ఠం వర్ణించగలడేమో గాని ఆ పెదవిలోంచి ఉట్టిపడే అమృత మాధుర్యాన్ని మన మూహించుకోవలసిందే. గాయకుడు పాడితే రెండుతీగల మీద ఆ స్త్రీయొక్క శృంగార రసాన్ని నట్టొట్లు పణ్ణిచ్చేదేమోగాని,

తోణికింపు కతీతమై విలసిల్లే ఆ ప్రేమపూరితమైన నీరవ విజ్ఞానం మన మూహించుకోవలసిందే.

ఆమెకూ బూచికీ ఏమాత్రం పోలికలేదు. ఆమె చర్యకూ అయ్య వారి చర్యకూ సహస్రవార. అయితే నాకు లోపల పికరు. ఆమెను చూచి నప్పుడల్లా పికరే ! ఈ పికరు వదిలిపొయ్యే గత్యంతరం ఏమిట్రా అని నూనూగు మీసాలొచ్చి నప్పట్నుంచీ ప్రయత్నం.

ఓ రేయి జాడజాడగా వెన్నె లగపిస్తూవుంది. వాడవాడా "నీడా? గోడా?" అన్న అనుమానమే. ఆలాంటప్పుడు ఆపె, అనగా చంద్రవంక అన్న జవ్వని విహరిస్తూవుంది. నాకు లోపల జంకట్టు కుందెందుకో ? సమయం దొరికిందికదా అని నా పూర్వ పరిచితులైన, పరిచితులని ఎందుకు అంటూవున్నా ననగా వారంటే చాలాకాలమై భయము నాకు పోయిందిగా !—ఆ బూచాడూ ఆ వుపాధ్యాయుడూ ఇద్దఱూకూడా నన్ను దుయ్యబట్టుకొని "ఏమోయి వత్సా! భయపడుతున్నావు?" అని అడిగారు. అడిగితే "భయం ? నాకెందుకు భయం ?" అన్నాను. అన్నానేగాని లోపలి పికరు ? అదల్లాగే వుంది. అప్పుడు వుపాధ్యాయుడు ఏంచేశాడు అంటే అల్లా ఖదేరావు అన్నాడు. అని నాకు ఆ పిల్ల నుగురించి "సెక్సు ఫిజియాలిజీ", అంటే ఇప్పటి పరిభాషలో ఇ. యన్. టీ. లు అనుకోండి, ఆ సంగతులన్నీ విప్పిచెప్పినట్లు చెప్పి చూపించాడు. ఆపాళంగా అను కొన్నాను. "నీ తస్సాదియ్యా ! ఉపాధ్యాయుడా ! నీ కడుపులో ఎంత వూకవుందీ !" అనుకొన్నాను. వాని సౌందర్య విజ్ఞానానికి ముగ్ధుణ్ణై పోయాను. ఆలా ముగ్ధుణ్ణై యుపాధ్యాయుణ్ణి బ్రహ్మారథం పట్టేస్తూ వుంటే బూచాడేంచాశాడూ ? "ఉపాధ్యాయుడు చెప్పింది అసలు

నేర్చుకోవలసినదానిలో ఆవగింజంతన్నా కాలేదు." అని తాను 'సెక్సు సైకాలిజీ", అంటే ఇప్పటి పరిభాషలో, కిసెస్సు, వాటిగివింగ్సు, వాటి మిస్సింగ్సూ, వాటి మిస్గివింగ్సూ అనుకోండి. ఆ సంగతులన్నీ క్షుణ్ణంగా మధించి వ్రాక్రుచ్చినట్లు వ్రాక్రుచ్చి కర్ణపేయం గావించాడు. ఆపాళంగా అనుకొన్నాను "నీ యింట బటారంగాను బూచోడా నీవెంతవాడవోయి !" అని అనుకొన్నాను. వాని ప్రణయ విజ్ఞానానికి నోరు తెఱచి నిర్విణ్ణుణ్ణై పోయినాను.

ఇప్పుడు నీ కడుపులో భయం ఏలావుంది ? అన్నారు ఇద్దఱు స్నేహితులూకూడా వొక్క గొంతుకనన్నట్టు. అంటే పాపభయం పోయిం దన్నాను. "మరేం భయమట్టుకుంది ?" అని అడిగేరు. "పెళ్ళి భయం" అన్నాను.

అనేసరికి "ఆ భయం మేం తీర్చలేం ఆర్చలేం. అది మీలో మీరు చూచుకోవలసిందే" అని బూచాడూ ఉపాధ్యాయుడూకూడా ఇద్దఱూ తిరోహితులైనారు. అక్కడున్నదల్లా నేనూ ఆ సుందరీ ! సుందరి మెల్లిగా అడిగింది. "పెళ్ళిభయం అంటే ఏమిటి ?" అని "ఏమీలేదు నీ ముఖంమ్మీది పోత్రప్పాక్కులేను" అన్నాను. ఆపాళంగా పక్కున నవ్వి ఆ చక్కనిచుక్క "ఇవిల్లావుంటాయి అనుకొంటూ వున్నారా ? ఇవెంతోసేపా పోంగొట్టుకోవాలంటే ? ఆలా బజారుకెళ్ళి వొక స్నో సీసా వొక్క ఫేస్ పౌడరు డబ్బా, తీసుకురండి. తీసుకువచ్చి నా కివ్వండి. ఇచ్చి అలాచూస్తూ వుండండి" అంది. తెచ్చి యిచ్చాను. ఆ రెండూ చంకనెట్టుకుని "చూడండీ ! వీటికేంగాని cream తెలియదూ మీకు ? వెండ్రుకలూడ్చే మీగడ ? ఆఁ తెలియకేం ? బొమ్మకూడా చూచే వుంటారు ! అదో ట్యూబ్ తెచ్చిపెట్టండి" అంది. తెచ్చియిచ్చాను.

"దాంతోపా టోగ్గి సరీన్ ట్రాన్సపెరెంటు సోపుతెచ్చి పెట్టలేకపోయినారూ" అంది. అదీ తెచ్చియిచ్చాను. "మటీ వో వోయిల్‌చీర ? ఓ కోయిల్ కలర్ బాడీస్ ? సోయిల్సుపోయే కెమికల్‌వాష్ అవన్నీ యేవండీ ?" అంది. అవీ తెచ్చియిచ్చాను. ఆలాగ్గా అడిగిందల్లా ఆ సుందరికి పట్టుకువచ్చి యిస్తూ ఆ సుందరికేసి చూస్తూ కొంతకొంత పికరు పోగొట్టుకున్నాను. కొంతకొంత అని ఎందుకు అన్నానూ అంటే పెళ్ళి కాకుండానే ఇన్ని కోరికలు కోరినమనిషి పెళ్ళికాలమందెన్ని కోరుతుందో అని—ఎన్ని హిరాణ్యాక్ష వరాలడుగుతుందో అని కొంతమట్టుకవన్నీ అంచనావేసి, ఒక అరచేతి వెడల్పు జరీవున్న సేలంచీర, బెత్తెడు వెడల్పున్న ఫైనుసహా రిస్టువాచీ, మణుగున్నరతూగే ఏకండీ మిఠాయివుండా యిలాంటివన్నీ పెళ్ళి బహూమానాలంటూ పట్టుకొచ్చి పెళ్ళికిముందే చూపించి ముందుంచాను. సుందరి మిక్కిలి సంతోషించింది. అవన్నీ అంది పుచ్చుకుంది. పుచ్చుకొనిఅందికదా "చూడండీ ! పెళ్లికి భాజా భజంత్రీలు పెట్టబొయ్యేరు గనుక పురోహితుణ్ణి పిలవనంపేరు గనుక ?" అంది. "వద్దంటే మానేశాస్తాను." అన్నాను. "వద్దన్నమాటేగా ! మఱొక్కటే ! పెళ్లి అప్పుడు మీరే వాగ్దానాలు చేసినాసరే నేను మాత్రం ఏమీ వాగ్దానం చెయ్యనుసుమండీ ! ఆడదానికి వాగ్దానాలు ఏమిటి, కోరిక లుంటేచెప్పుకోవాలిగాని" అంది. అంటే ఏమనీది నేను ! పోయినపికరు మళ్ళా కొంచెం ఇంటెర్మిటెంటు ఫీవర్లా నాకు లోలోపల తగిలింది. అయినా అది పైకి వెల్లడించకుండా "సరే నీ యిష్టంవచ్చినట్లే" అన్నాను. అగ్నిహోత్రంముందు కూర్చుని "నాతిచరామి" అని నా మాట నేను వప్పగించాను. మగాడిది వాగ్దానమేగా వాడికి కోరికలేమిటి గనకా ! సుందరి నా చెవిలో మెల్లిగా తన కోరిక లిలా వూదింది. "చూడండీ ! నేను మీకేసి చూచినప్పుడే మీరు నా కేసి చూడవలెను. నేను మిమ్మల్ని

ముద్దెట్టుకున్నప్పుడే మీరు నన్ను ముద్దెట్టుకోవలెను. నేను మిమ్మల్ని కౌగలించు కొన్నప్పుడే మీరు నన్ను కౌగలించుకోవలెను" అని నెలకు మూడు వానల్లా మూడు కోరికలు కోరుకుంది.

కోరి అటుతిరిగి కూర్చుంది. నేను ఇటుతిరిగి కూర్చున్నాను. అగ్నిహోత్రుడు సాక్షిగా మళ్ళీ ఆ సుందరి నాకేసిచూడలేదు. నేను ఆ సుందరికేసి చూడలేదు. పోనీ కళ్ళుమూసుకు ముద్దెట్టుకొంటుందేమో అని అనుకున్నాను. ఉఁహూ! పోనీ చూడకుండా ముద్దీకుండా ఊరికే కావలించుకుంటుందేమో అని రెండు ఘళ్ళు ఆలానే కనిపెట్టుక్కూర్చు న్నాను. ఉఁహూ! పోనీ నేనై ఆ పనులన్నీ ముందేచేదామా అని తల పోస్తే నాకు "నాతిచర" అయిరి.

మొదటితరం రెండోతరం మూడోతరం ముత్తైదువు లెంతోమంది వచ్చి "ఇవేం కోరికలే, మగాణ్ణి అణిచేసే కోరికలు! అసలే పెళ్ళిభయం అన్నవాడికి మఱీ పిరికిమందు పోశేశావు, ఏవో కూడరానికోరికలు కోరి; ఇలాంటి కోరికలుంటాయటే! మగాణ్ణి వాడి యుత్సాహాన్ని పురస్క రించుకుని ఆడది ఎత్తెయ్యాలిగాని" అని ఎంత బోధించినా నాచంద్ర వంక ఉఁహూ! పైపెచ్చు "నేనేం కోరుకొన్నానో మీకు తెలుసునా?" అని ముదలకించింది వాళ్ళందర్నీని. వాళ్ళు నాదిక్కుమొగమై "నీకేం చేటొచ్చింది? అది ఇటు తిరక్కపోతే నీవటు తిరక్కూడదా?" అన్నారు. అంటే నాకు "నాతిచరామి! నాతిచరామి! నాతిచరామి!" అన్నాను మిక్కిలి నిర్భయంగా! నవ్వలేక చచ్చారు వాళ్ళంతా! చంద్ర వంకకూడా కొంచెము ముసిముసినవ్వు నవ్వింది. చాలనుకున్నాను. మఱి ఎలాంటి భయం లేదనుకున్నాను.

| రచన | స్ఫురణ | తొలిప్రకటనము |
|---|---|---|
| 21-2-1937 | రాజమండ్రి | 'వినోదిని'లో |